క్లుప్తంగా

గూడూరు స్వప్నకు డాక్టరేట్



కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన గూడూరు స్వప్నకు అప్లైడ్ స్టాటిస్టిక్స్ విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రవీందర్‌గుప్తా చేతుల మీదుగా స్వప్నకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఫైనాన్షియల్ టైమ్ సిరీస్ డేటా ప్రిడిక్షన్ పేరుతో గణాంకాలు, ఆర్టిఫీషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించడం, అంచనా వేయడం లాంటి స్టాటిస్టిక్ అంశాలపై ప్రొఫెసర్ హరగోపాల్, డాక్టర్ సంపత్‌ల పర్యవేక్షణలో పరిశోధనలు పూర్తిచేశారు. దీనికి సంబంధించి తెలంగాణ విశ్వవిద్యాలయంలోథీసిస్‌ను సమర్పించగా న్యూరల్ నెట్వర్క్ అండ్ ఫోర్ కాస్టింగ్ మెథడ్‌ను ఉపయోగించి, ఫైనాన్షియల్ టైమ్ సిరీస్ డాటాను అంచనా వేయడం అంశానికి స్వప్న డాక్టరేట్ అందుకున్నారు. జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి సతీమణి స్వప్న ప్రస్తుతం హైదరాబాద్‌లోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గూడూరు స్వప్నకు డాక్టరేట్ పట్టా రావడం పట్ల,కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వాటర్ కూలర్



వాటర్‌కూలర్‌ను ప్రారంభిస్తున్న అబ్బయ్య

ఇబ్రహీంపట్నం: ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో వాటర్‌కూలర్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాటర్‌కూలర్‌ను ఆర్టీసీ డిపో మేనేజర్ అశోక్ రాజుతో కలిసి గాంధీ ఆస్పత్రి వైద్యులు అబ్బయ్య మంగళవారం ప్రారంభించారు. బస్ స్టేషన్‌లో ప్రారంభించిన వాటర్‌కూలర్‌తో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డా.అబ్బయ్య అన్నారు. ఇందుకు కృషిచేసిన డిపో మేనేజర్ అశోక్‌రాజును, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ సత్తయ్య, బస్‌స్టేషన్ మేనేజర్ దుశ్శాసన్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామంలో తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందిన గీత కార్మికుడు పెద్దయ్యగౌడ్ కుటుంబ సభ్యులను మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందించారు. అలాగే అవురుపల్లి గ్రామంలో విలేకరి మహేందర్ తల్లి చనిపోవడంతో మహేందర్ వారి కుటుంబసభ్యులను బాలాజీసింగ్ పరామర్శించారు. కార్యక్రమంలో మాడ్గుల గౌడసంఘం అధ్యక్షుడు రాజుగౌడ్, నాయకులు నిరంజన్‌గౌడ్, శంకర్‌గౌడ్, మసున విష్ణు, మహేశ్, ఆంజనేయులు, బాలరాజుగౌడ్, సత్యనారాయణగౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్లలో కోతుల బెడద

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో కోతుల బెడదను నివారించాలని మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ సలాం డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌కు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కోతుల బెడద కారణంగా చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. పదోతరగతి పరీక్షల నేపథ్యంలో గ్రామాల్లో డీజేలు, లౌడ్‌స్పీకర్లు నిషేదించాలని కోరారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.స్థానిక నాయకులు ఎల్లేష్, ప్రవీణ్, శ్రీను వాస్, జగన్, మాజీ సర్పంచ్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

ఇబ్రహీంపట్నం:రాయపోల్ గ్రామంలో ఉపాధి హామీ పనులను మంగళవారం సర్పంచ్ గంగిరెడ్డి బల్వంత్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీటీసీ అచ్చన శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆస్తిపన్నుపై రాయితీ

ఇబ్రహీంపట్నం: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈనెల 30వ తేదీలోపు ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ ఉంటుందని ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వందశాతం హాజరు

మంచాల: మంచాల మండల కేంద్రంలో వివిధ సెంటర్లలో మంగళవారం నిర్వహించిన పదవ తరగతి పరీక్షకు నూటికి నూరు శాతం విద్యార్థులు హాజరైయ్యారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 136 మంది, జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో160 మంది, కేజీబీవీ పాఠశాలలో190 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నామ్‌కే వాస్తే ‘అప్‌గ్రేడ్’

- ఏడాది కిందట సీహెచ్‌సీగా మారిన పీహెచ్‌సీ
- అసంపూర్తిగా సిబ్బంది, డాక్టర్ల నియామకం
- మెరుగైన వైద్యం అందక ఇబ్బంది పడుతున్న రోగులు



యాచారం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం

యాచారం: యాచారం సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదు. పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) నుంచి సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ జరిగితే అన్నిరకాల వైద్యం ఉచితంగా అందుతుందనే ఆశలు సన్నగిల్లుతున్నాయి. పీహెచ్‌సీగా ఉన్నప్పుడే నయం.. సీహెచ్‌సీగా మారినప్పటి నుంచి ఆ ఆస్పత్రిలో వైద్య సేవలు అధ్వానంగా మారాయని రోగులు మండిపడుతున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు కలిపి మండల కేంద్రంలో ఒకే ఒక సీహెచ్‌సీ ఉంది. ఈ మండలంలో చాలా గ్రామాల్లో రెక్కాడితే గాని డొక్కాడని ప్రజలు ఉన్నారు. నిత్యం కష్టం చేసుకుంటే తప్పా కడుపు నిండని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజులుగా మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలు విషజ్వరాలు, కాళ్ల, కీళ్ల నొప్పులు, షుగర్, బీపీ, కుక్క కాటు వంటివాటితో బాధపడుతున్నారు. నిత్యం సీహెచ్‌సీ ఆస్పత్రికి గ్రామాల నుంచి 250 మందికి పైగానే రోగులు వస్తారు. రెండు రోజులుగా వైద్యులెవరూ అందుబాటులో లేకపోవడంతో వైద్య సేవలు నిలిచిపోయాయి. వచ్చే వైద్య సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతారో తెలియక రోగులు అవస్థలు పడుతున్నారు. వైద్యుల రాకపై రోగులు ఆరా తీస్తే వారి ఇష్టం ఎప్పుడైన వస్తారు.. ఎప్పుడైన పోతారు.. వచ్చినప్పుడే చూపించుకోండి.. లేదంటే వెళ్లిపోండి అంటూ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు రోగులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో వైద్య సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అప్‌గ్రేడ్ అయి ఏడాది..

యాచారం పీహెచ్‌సీ 2022 ఫిబ్రవరిలో అప్‌గ్రేడ్ అయి సీహెచ్‌సీగా మారింది. సీహెచ్‌సీగా మారడంతో ఈ ఆస్పత్రి రాష్ట్ర వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వెళ్లిపోయింది. అయితే ఆస్పత్రి బోర్డు మారడం తప్పిస్తే అప్‌గ్రేడ్‌కు తగ్గట్లు సిబ్బంది నియామకం జరగలేదు. కేవలం ఒకే ఒక వైద్యుడు నియామకం అయ్యాడు. సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ అయితే అన్నిరకాల వైద్యసేవలకు ప్రత్యేక వైద్యులు ఉంటారని, అన్ని సేవలు ఈ ఆస్పత్రిలోనే ఉచితంగా అందుతాయని రోగులు ఎంతో ఆశపడ్డారు. నియామకమైన సురత్‌కుమార్ అనే వైద్యుడు ఎప్పుడు వస్తాడో.. ఎప్పుడు పోతాడో తెలియదు. కొద్ది రోజుల కింద ఆస్పత్రికి రోగులు వస్తే వైద్యులు లేకపోవడంతో ఎంపీపీ కొప్పు సుకన్య ఆస్పత్రిలోనే బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఉన్నతాధికారుల జోక్యంతో సమస్య సద్దుమణిగింది. ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయి ఏడాది గడుస్తున్నా పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది, అవసరమైన వైద్య పరికరాలు, మందులు అందుబాటులో లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అందని వైద్య సేవలు..

యాచారం మండలంలో నిరుపేదలు ఎక్కువగా ఉన్నారు. వైద్యం నిమిత్తం యాచారం ప్రభుత్వాస్పత్రికి వస్తే మెరుగైన వైద్య సేవలు అందకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. రోగుల అవసరాన్ని ఆసరాగా మల్చుకుంటున్న ప్రైవేట్ ఆస్పత్రుల యజమాన్యాలు రకరకాల పరీక్షల పేరుతో వారిని లూటీ చేస్తున్నారు. సాగర్ రోడ్డుపై ప్రమాదాలకు గురైన క్షతగాత్రులు సైతం సకాలంలో వైద్య అందకపోవడంతో నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

వైద్యులు ఉండటం లేదు



యాచారం పీహెచ్‌సీ.. సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ అవడంతో సంతోషించాం. అయితే ఆస్పత్రికి వెళ్తే వైద్యులు ఉండరు. తీరా ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి వస్తుంది. గతంలో కొద్ది వరకైనా వైద్య సేవలు అందేవి. ప్రస్తుతం మరింత అధ్వాన్నంగా మారాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలి.

– వెంకటేష్, మొండిగౌరెల్లి

తీరుమారకుంటే ఆందోళన చేస్తాం



యాచారం పీహెచ్‌సీని ఏడాది కిందటే కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేశారు. నేటికీ పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించకపోవడం దారుణం. ఒక వైద్యుడిని నియమిస్తే ఆయన ఎప్పుడు వస్తాడో.. ఎప్పుడు పోతాడో తెలియదు. రోగుల ఫిర్యాదు మేరకు కొద్ది రోజుల కింద ఆస్పత్రిని తనిఖీ చేసి ఆందోళన చేపట్టి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సేవల్లో మార్పు లేదు. తీరు మారకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నాం.

– కొప్పు సుకన్య, ఎంపీపీ

చర్యలు తీసుకుంటాం

యాచారం పీహెచ్‌సీ ఏడాది కిందటే సీహెచ్‌సీగా మారింది. కాని పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది నియమితులు కాలేదు. పీహెచ్‌సీ వైద్య సిబ్బందితోనే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన సిబ్బందిని నియమిస్తాం. వైద్యసేవలపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తా. సమయపాలన పాటించనివారిపై చర్యలు తీసుకుంటాం.

– వరదాచారి, జిల్లా అధికారి, రాష్ట్ర వైద్య విధాన పరిషత్

అబ్దుల్లాపూర్ అంబేడ్కర్ సంఘం నూతన కార్యవర్గం

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్ గ్రామ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడిగా మంగళిపల్లి మహేష్, ప్రధాన కార్యదర్శిగా గుండె నరేష్‌తో పాటు నూతన కార్యవర్గ విస్తరణ మంగళవారం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా గుండె రవీందర్, ఉపాధ్యక్షుడిగా గుండె ప్రవీణ్, మంగలిపల్లి కిరణ్, ఎల్లంకి నవీన్, లక్ష్మన్, శివకుమార్, కార్యదర్శిగా సంజీవ, సంయుక్త కార్యదర్శిగా చిర్ర శివకుమార్, భాను, కోశాధికారిగా సురేష్, ప్రచార కార్యదర్శిగా శ్రీకాంత్, క్రీడా కమిటీ కన్వీనర్లుగా నవీన్, అనీల్, సలహాదారులుగా జంగయ్య, నర్సింహ, రాజు, స్వామి, 11 మంది కార్యవర్గసభ్యులను నియమించినట్లు వారు పేర్కొన్నారు.

పల్లెప్రగతి పనుల పరిశీలన



నర్సరీని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రాఘవులు

ఆమనగల్లు: మాడ్గుల మండలం నర్సంపల్లి గ్రామంలో మంగళవారం పల్లెప్రగతి పనులను ఎంపీడీఓ రాఘవులు పరిశీలించారు. గ్రామంలోని నర్సరీ, డంపింగ్‌యార్డు, శ్మశానవాటికలను పరిశీలించారు. మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం పాఠశాల, అంగన్‌వాడీకేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పంచాయితీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హన్మానాయక్, గ్రామ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ వెంకటేశ్

తలకొండపల్లి: విద్య ద్వారనే సమాజం తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ వెంకటేశ్ ముఖ్య అతిథిలుగా హాజరై 410 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఈ సందర్భంగా కోరారు. ప్రతి రోజు క్రీడలకోసం సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు రమేష్, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సర్పంచ్ లలిత, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, మాజీ సర్పంచ్ రాములు, శ్రీశైలంగౌడ్, జగ్గారెడ్డి, దాసు, గణేష్, చెన్నయ్య, రాజు, నరేష్, జ్యోతయ్య పాల్గొన్నారు.

బంజారా భవన్‌కు రూ.2 కోట్లు మంజూరు

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గిరిజన నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో బంజారా భవన్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారి రాజీవ్ చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి మున్సిపాలిటీ బీఆర్ఎస్ కన్వీనర్ పత్యానాయక్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు, కడ్తాల జెడ్పీటీసీలు అనురాధ, జర్పుల దశరథ్‌నాయక్, ఆమనగల్లు ఎంపీపీ అనిత విజయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సరిత పంతునాయక్, లచ్చిరాంనాయక్, సర్పంచ్‌లు సోన శ్రీనునాయక్, అమర్‌సింగ్, ఈశ్వర్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావ్, నాయకులు శ్రీను, నిరంజన్‌గౌడ్, రామకృష్ణ, రఘు, రమేష్, రాములుయాదవ్, ప్రశాంత్‌నాయక్, మల్లేష్, రవీందర్‌నాయక్, కృష్ణనాయక్, సురేశ్‌నాయక్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి



శేఖర్‌గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘాల నేతలు

యాచారంలో శేఖర్‌గౌడ్ దిష్టిబొమ్మ దహనం

యాచారం: మాల కులస్తులను కించపర్చేలా మాట్లాడిన కాంగ్రెస్ నేత ఈసీ శేఖర్‌గౌడ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. రెండు రోజుల కింద నగర శివారులో కాంగ్రెస్ సమావేశంలో మాల కులస్తులను కులం పేరుతో కించపర్చేలా ఈసీ శేఖర్‌గౌడ్ మాట్లాడినట్లు ఆరోపించారు. ఈసీ శేఖర్‌గౌడ్ మాల కులస్తులకు వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ మంగళవారం యాచారం మండల కేంద్రంలో దళిత సంఘాల శ్రేణులు ఆందోళన చెపట్టారు. అంబేడ్కర్ చౌరాస్తా వద్ద ఈసీ శేఖర్‌గౌడ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం యాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేశ్, దళిత సంఘాల నాయకులు స్వరూప, శశికళ, కృష్ణ, మండలి గోపాల్, అమరేందర్, ఆనంద్, అంజయ్య, రమేష్, రాఘవేందర్, సంపత్, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా ఇవ్వండి

ఎంపీడీఓకు గోవింద్‌రెడ్డి కాలనీవాసుల వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

యాచారం: మండల పరిధి మంతన్‌గౌరెల్లి గ్రామంలోని గోవింద్‌రెడ్డి కాలనీలో విద్యుత్ సమస్యలు తీర్చాలని మంగళవారం గ్రామస్తులు ఎంపీడీఓ విజయలక్ష్మీకి ఫిర్యాదు చేశారు. గోవింద్‌రెడ్డి కాలనీలో వంద ఇళ్లు ఉంటాయని కాలనీలో విద్యుత్ స్తంభాలు లేక సరఫరానే లేదని అన్నారు. విద్యుత్ సరఫరా కోసం పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు, గ్రామ పంచాయతీకి ఫిర్యాదు చేసినా స్పందన లేదని అన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను కోరారు. ప్రతి ఏడాది ఇంటి పన్నులు, నీటి బిల్లులు చెల్లిస్తున్నామని, కానీ విద్యుత్ సరఫరా లేక చీకట్లో మగ్గుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ జ్యోతినాయక్, మాజీ ఎంపీటీసీ అరవింద్‌నాయక్, గ్రామస్తులు హర్సింగ్, మధుకర్,రమేష్, వెంకటయ్య, శంకర్, మోతీలాల్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీ విజయ గణపతి, సరస్వతీ సహిత శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం శివాచార్య మహాస్వామి శిష్యబృందంతో పాటు, అంగడిమఠం భువనేశ్వర్ బృందం ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ దాత పి.బస్వరాజ్–రాజమణి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

తుర్కయంజాల్: అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు సీఎం సహాయనిధి పథకం ద్వారా చేయుతనందిస్తూ బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. మంగళవారం పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లికి చెందిన కొంతం కృష్ణారెడ్డి, కమాటి లిఖితకు ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్, మర్రి సంపతీశ్వర్ రెడ్డి, ఏనుగు అయ్యప్ప రెడ్డి, కొంతం యాదిరెడ్డి, కందాడి కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్మశానవాటికలో బోర్ మోటార్ ప్రారంభం

మంచాల: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు పోవడం జరుగుతుందని మంచాల మండల జెడ్పీటీసీ మర్రినిత్యారెడ్డి, ఎంపీపీ నర్మద అన్నారు. మంచాల మండల పరిధిలోని చెన్నారెడ్డిగూడ గ్రామంలో జిల్లా పరిషత్ నిధుల నుంచి శ్మశానవాటికలో తాగునీటి సదుపాయం కోసం మంగళవారం బోరు వేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిషన్ నాయక్, ఎంపీటీసీ పరంగా, సింగల్ విండో బ్యాంకు డైరెక్టర్ జెనిగె వెంకటేశ్, ఉప సర్పంచ్ పిడుగు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సలేశ్వరం జాతరకు ప్రత్యేక బస్సులు

తలకొండపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం సలేశ్వరం జాతర ఉత్సావాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కల్వకుర్తి డిపో మేనేజర్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల్ మండలాల ప్రజలు పెద్దఎత్తున సలేశ్వర జాతరకు తరలివెళ్తారని.. భక్తుల కోరిక మేరకు కల్వకుర్తి నుంచి సలేశ్వరంకు పెద్దలకు రూ.240, పిల్లలకు రూ.120 బస్ చార్జీలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈనెల 7వ తేదీ వరకు సలేశ్వరం జాతర కొనసాగుతుందని అప్పటివరకు బస్సు సర్వీసులు నడుస్తాయని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

యాచారం: కాంగ్రెస్‌శ్రేణులకు ఏకష్టం వచ్చినా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ కార్యకర్త జిల్లా ప్రవీణ్ అనారోగ్యంతో ఉస్మానియాలో చికిత్స పొంది కొద్ది రోజుల కిందే గ్రామానికి వచ్చాడు. సమాచారం తెలుసుకున్న మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి మంగళవారం గ్రామానికి వచ్చి ప్రవీణ్‌ను పరామర్శించి రూ.10 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్, నాయకులు మంకాల దాసు, మస్కు నర్సింహ, అక్బర్, జగదీష్, విజయ్‌కుమార్, కానమోని జంగయ్య, కొండలు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

జెడ్పీటీసీ వెంకటేశ్



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న జెడ్పీటీసీ వెంకటేశ్, అధికారులు

తలకొండపల్లి: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పోషణ పక్వాడలో భాగంగా వంటకాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న చిరుధాన్యాలు, ఆకు కూరలు, పాలు, గుడ్లు, కాయగూరలపై సీడీపీఓ ఆధ్వర్యంలో గర్భిణిలు, బాలింతలు, కిషోర్ బాలికలు, మహిళలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ హాజరై మాట్లాడారు. చిరుధాన్యాల్లోని అధిక పోషక విలువలు చిన్నారుల ఎదుగుదలకు తోడ్పడుతాయన్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, సర్పంచ్‌లు లలిత, గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, జ్యోతయ్య, ఎంపీటీసీలు రమేష్, అంబాజీ, ఉప సర్పంచ్ అనిల్, సింగిల్‌విండో డైరెక్టర్ దేవులానాయక్, డాక్టర్ సైదమ్మ, సీడీపీఓ సక్కుబాయి, సూపర్‌వైజర్ తిరుపతమ్మ, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమగనల్లు పట్టణంలోని హోలియా దాసరి సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొదటి విడతగా రూ.లక్ష విరాళంగా అందించారు. గత నెలలో హోలియా దాసరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సాయం అందించాలని కోరగా రూ.3 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆమనగల్లు పట్టణంలో మంగళవారం హోలియా దాసరి సంక్షేమ సంఘం సభ్యులకు ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి రూ.లక్ష అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, హోలియా దాసరి సంక్షేమ సంఘం సభ్యులు రాములు, సత్యనారాయణ, సాయిలు, రాములు, యాదయ్య, లక్ష్మీనారాయణ, ఎల్లయ్య, రాజశేఖర్, వెంకటేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంజయ్య కుటుంబానికి అండగా ఉంటాం



నగదు అందజేస్తున్న అంజయ్య మిత్రులు

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన సూద అంజయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని మండల కేంద్రానికి చెందిన 1995–96 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన అతని చిన్ననాటి మిత్రులు మంగళవారం పరామర్శించారు. మిత్రుడు అంజయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి వారు రూ.1.05 లక్షలు ఆర్థికసాయం అందించారు. భవిష్యత్తులో ఏ సమస్య వచ్చిన అండగా ఉంటామని ధైర్యానిచ్చారు. అంజయ్య కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. వెంకటేశ్, గణేశ్‌గౌడ్, పర్వత్‌కుమార్, మూడరాజు, శేఖర్‌రెడ్డి, యాదగిరి, వెంకటేశ్, ఉపసర్పంచ్ రామకృష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, లియోక్లబ్ అధ్యక్షుడు రాజేశ్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

పోచారంలో భూ తగాదా

పీఎస్‌లో ఫిర్యాదు చేసిన ఇరువర్గాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ భూమి విషయమై ఇరువర్గాలు ఘర్షణ పడి చివరకు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం గ్రామంలో గౌరిగే కృష్ణ అనే వ్యక్తి ఓ వర్గం వారి వద్ద కొంత భూమి కొనుగోలు చేశాడు. పక్కనే ప్రభుత్వ స్థలంలో మైలారం అయిలమ్మ కుటుంబ సభ్యులు ఇంటి నిర్మాణం చేసుకొని ఉంటున్నారు. కృష్ణ ప్రభుత్వ సర్వేయర్‌ను పెట్టి కొలతలు వేయగా అయిలమ్మ ఇంటి ప్రహరీ వరకు వచ్చిందని దీంతో కడీలు పాతడానికి గత రెండు రోజులుగా ప్రయత్నిస్తున్నాడు. అయిలమ్మ కడీలు వేయకుండా అడ్డుకుంది. దీంతో కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం మరోమారు కడీలు పాతుతుండగా అయిలమ్మ కుటుంబ సభ్యులు అడ్డుపడ్డారు. అయిలమ్మ కుటుంబ సభ్యులు కూడా కృష్ణపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కృష్ణ.. అయిలమ్మ కుటుంబ సభ్యులు గోడను వదిలేసి పక్క నుంచి కడీలు పాతుకుంటాడని గ్రామపెద్దలు తీర్పు చెప్పినా పట్టించుకోలేదని చెబుతున్నారు. ఇరువర్గాలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఇంటింటికి బీజేపీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

ఇబ్రహీంపట్నం: ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పల్లెపల్లెకు ఓబీసీ ఇంటింటికి బీజేపీ కార్యక్రమానికి సంబంధించించిన వాల్ పోస్టర్‌ను ఇబ్రహీంపట్నంలోని వైష్ణవిగార్డెన్‌లో మంగళవారం బీజేపీ నేతలు విడుదల చేశారు. బీజేపీ శ్రేణులు ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని నేతలు తెలిపారు. అలాగే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు.